RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి : 13 సంచిక : 270 | మంగళవారం, మార్చి 10 2026 | ఎడిటర్ : బట్టు లక్ష్మీనారాయణ | పేజీలు : 6 వెల : రూ. 5.00

Hyderabad, Vijayawada, Vishakapatnam Tirupathi, Ananthapuram,Guntur,Nellor,Ongole,kadapa, Medak, Sangareddy, Siddipet, Nalagonda, Karimnagar,

## అమెరికా, ఇజ్రాయెల్‌తో మోదీ రాజీపడ్డారు

- కుట్ర బయటపడుతుందనే వెనకడుగు
- దేశ ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది
- సంక్షోభంతో చమురు ధరల పెరుగే అవకాశం
- కేంద్రంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- పశ్చిమాసియా సంక్షోభంపై చర్చకు డిమాండ్



**న్యూఢిల్లీ,మార్చి 9 :** భారత ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంట్‌లో చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం ఇష్టపడటం లేదని ఆరోపించారు. పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంట్‌లో చర్చ జరిగితే ప్రధాని మోదీ అమెరికా, ఇజ్రాయెల్‌కు ఎలా

మిగతా2లో...

## ప్రజాసేవలో ఎప్పుడూ పోలీసులే ముందు

- సాయం కోసం ప్రజలు పోలీసుల వైపే చూస్తారు
- ప్రజలకు మీరున్నారనే ధైర్యం ఇందుకు కారణం
- నేరాల తీరు మారి..సైబర్ క్రైమ్ పెరిగింది
- నేరాల తీరుకు అనుగుణంగా పనితీరు మార్చుకోవాలి
- పోలీస్ ఆఫీసర్స్ రీట్రీట్‌లో సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,మార్చి 9 :**ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి పోలీస్ అధికారులు చేస్తున్న కృషిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. మనం ఎక్కడున్నామోతెలిసుకోగలిగితే మనం ఎక్కడికి చేరుకోవాలో తెలుస్తుందన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమిలో తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్-2026 కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ రిట్రీట్ కార్యక్రమం ద్వారా సమస్యలు, పరిష్కారాలపై

మిగతా2లో...



## తెలంగాణ నుంచి ఇద్దరు రాజ్యసభకు ఏకగ్రీవం

- ధృవీకరణ పత్రాలు అందచేత

**హైదరాబాద్,మార్చి 9 :** తెలంగాణ నుంచి నామినేషన్ దాఖలు చేసిన ఇద్దరు అభ్యర్థులు రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డి సోమవారం

మిగతా2లో...

## అత్యున్నతంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ

- ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు
- ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ
- క్రీడాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



2లో

## ఇరాన్ కొత్త సుప్రీంగా మొజ్తబా

- ఖమేనీ రెండో కుమారుడు మొజ్తబా
- దేశవ్యాప్తంగా ప్రజలు సంబరాలు



**లెబనాన్, మార్చి 9 :** ఇరాన్ తమ దేశ నూతన సుప్రీం లీడర్‌ను ఎన్నుకుంది. కొత్త సుప్రీం లీడర్‌గా అయతొల్లా ఖమేనీ తనయుడు మొజ్తాబా ఖమేనీని ఎన్నుకున్నట్లు ఇరాన్ అధికారి కంగా ప్రకటించింది. 56 ఏళ్ల అయతొల్లా సయ్యద్ మొజ్తాబా హెుస్సేని ఖమేనీ అలియాస్ మొజ్తాబా ఖమేనీ ఇరాన్‌కు మూడో సుప్రీం లీడర్‌గా ఎన్నికయ్యాడు. మొజ్తాబాను ఇరాన్

మిగతా2లో...

## కవితకు మళ్లీ నోటీసులు!

- లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం..





2లో

## రైతుబంధు పథకం బంద్... రాహుల్ బంద్ స్టార్ట్

- సిఎం రేవంత్‌పై కెటిఆర్ వ్యంగ్యాస్త్రాలు



**రాజన్నసిరిసిల్ల,మార్చి 9 :** రాష్ట్రంలో రైతు బంధు పథకాన్ని బంద్ చేసి.. కొత్తగా రాహుల్ బంధు పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ తీసుకు వచ్చారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యంగ్యంగా అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి ఏడాదికి రూ. వెయ్యి కోట్లు పంపడమే రాహుల్ బంధు పథకమని ఆయన అభివర్ణించారు. సంవత్సరానికి రూ.1000 కోట్లు కప్పం కట్టి తన పదవిని సీఎం రేవంత్ రెడ్డి కాపాడుకొంటున్నారని ఆరోపించారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో కేటీఆర్ పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఆయన ఘనంగా

మిగతా2లో...

## వెలుగుమట్ల బాధితులతో కవిత ధర్నా

- ఖమ్మం జడ్పీ కూడలిలో ఆందోళన
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- కవితను అరెస్ట్ చేసిన పోలీసులు



**ఖమ్మం,మార్చి 9:** ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులకు న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవనంలో వెలుగుమట్ల బాధితులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటివరకూ బాధితులకు ప్రభుత్వం అండగా లేదని విమర్శించారు. ప్రభుత్వం తరపున వారికి వైద్య సహాయం కూడా అందలేదన్నారు. అనంతరం ఖమ్మం జడ్పీ కూడలిలో కవిత ఆందోళనకు దిగారు. వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలంటూ ధర్నా నిర్వహించారు. బాధితులతో కలిసి జడ్పీ కూడలిలో రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని సర్ది చెప్పడంతో ఆమె నిరసనను విరమించుకున్నారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాలోని జడ్పీ సెంటర్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెలుగుమట్ల భూదాన్ యజ్ఞ బోర్డు భూముల నిర్వాసితులతో కలిసి ఆందోళనకు తెలంగాణ

మిగతా2లో...

## తిరుమల లడ్డూకు నెయ్యి కొరత లేదు

- అందుబాటులో తయారీకి కావాల్సినంత నెయ్యి
- తప్పుడు ప్రచారాలను ఖండించిన టిటిడి



**తిరుమల,మార్చి 9 :** శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి అవసరమైన నెయ్యి నిల్వలు సరిపడా ఉన్నాయని తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి బోర్డు స్పష్టం చేసింది. తితిదే వద్ద నెయ్యి నిల్వలు సరిపడా లేవని, లడ్డూ ప్రసాదాల తయారీలో అంతరాయం ఏర్పడుతోందని ఇటీవల కొందరు సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేయడంపై తితిదే స్పందించింది. ఇలా అసత్య ప్రచారం చేయడం సరికాదని తితిదే పేర్కొంది. లడ్డూల తయారీకి

మిగతా2లో...

## నా... మాట!

తెలంగాణలో అన్నదాతల పరిస్థితులు గోరంగా ఉన్నాయి..
రైతు భరోసా కోసం ఎదిరిచూసినా,
కండ్లు కాయలు కాస్తున్నాయి..
పెట్టుబడి సాయం లేక,
ఎక్కువ మిత్తిలకు అప్పు తెచ్చి వ్యవసాయం చేస్తున్నారు..
అరుగాలం కష్టపడి పంట పండిస్తే,
గిట్టుబాటు ధరలేక,దళారుల చేతిలో మోసపోతున్నారు..
ఆదుకునే నాధులు లేక,
సాయం అందించే చేతులు లేక,
ఎండిపోయిన పంటలను చూసి గుండెలు భాదుకుంటున్నారు..
దొంగ నాయకుల వాగ్దానాలు నమ్మి..
అన్నామో రామచంద్ర అంటూ నెత్తి కొట్టుకుంటున్నారు..
పెరిగిన నిత్యావసరాల ధరలను భరిస్తూ,
కుటుంబ ఆర్థిక పరిస్థితులను అధికమిస్తూ,
ఆడపిల్లలకు పెండ్లిళ్ళు చేయలేక,
కన్నా పిల్లలను ఉన్నతమైన చదువులు చదివించలేక,వ్యవసాయం
చేయడానికి చేతులు రాక,అందరికి అన్నం పెట్టె రైతన్నలు,
అడ్డమీద కూలీలుగా మారిపోయి కుటుంబాలను సాకుతున్నారు..

పెద్దపల్లి రాజన్న... 9848174314

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# అమెరికా, ఇజ్రాయెల్‌తో మోదీ రాజీపడ్డారు

(మొదటి పేజీ తరువాయి)

రాజీ పడ్డారో బయటపడుతుందని అన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితులు దేశ ప్రజలపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని తెలిపారు. అలాగే అక్కడి సంక్షోభం చమురు ధరల పెరుగుదలకు దారితీయవచ్చని అభిప్రాయపడ్డారు. "పశ్చిమాసియా సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద నష్టాన్ని కలిగిస్తుంది. స్టాక్ మార్కెట్లలో ఏం జరుగుతుందో మీరు చూశారు. ప్రధాని మోదీ అమెరికా ట్రేడ్ డీల్‌పై సంతకం చేశారు. దీంతో దేశం దెబ్బ తినబోతోంది. అలాగే పశ్చిమాసియా సంక్షోభం గురించి చర్చించడంలో వారికి ఏ సమస్య ఉంది? ఆ తర్వాత మనం ఇతర అంశాలపై చర్చ జరపవచ్చు. పశ్చిమాసియా మన దేశానికి ముఖ్యం కాదా? ఇంధన ధరలు, ఆర్థిక విధ్వంసం మనకు ముఖ్యమైన చర్చనీయాంశాలు కావా? అవే మనకు ప్రజా సమస్యలు" అని రాహుల్ గాంధీ అన్నారు. పశ్చిమాసియా సంక్షోభాన్ని తాము ముఖ్యమైనదిగా భావిస్తున్నామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అందుకే ఆ అంశంపై చర్చను కోరుతున్నామని అన్నారు. "కానీ కేంద్ర సర్కార్ పశ్చిమాసియా సంక్షోభం గురించి చర్చ జరిపేందుకు ఇష్టపడడం లేదు. ఎందుకంటే ఆ అంశంపై చర్చ జరిపితే ఇతర విషయాలు బయటకు వస్తాయి. ప్రధాని మోదీ వైఖరి బయటపడుతుంది. మోదీ ఎలా రాజీ పడ్డారు? ఆయనను ఎలా బ్లాక్ మెయిల్ చేస్తున్నారు? వంటి విషయాలు తెలుస్తాయి. అందుకే పార్లమెంట్‌లో పశ్చిమాసియా సంక్షోభంపై చర్చకు కేంద్రం ఇష్టపడడం లేదు. చర్చకు డిమాండ్ చేస్తున్న సమయంలో ప్రధాని మోదీ పార్లమెంట్ నుంచి ఎలా పారిపోయారో మీరు చూశారు. ఒకవేళ పశ్చిమాసియా సంక్షోభంపై చర్చ జరిగితే ప్రధాని మోదీ పార్లమెంట్‌కు రాలేరు" అని రాహుల్ వ్యాఖ్యానించారు. అలాగే వీబీ జీ రామ్ జీ అమలు నేపథ్యంలో కేంద్ర సర్కార్‌పై కాంగ్రెస్ మండిపడింది. ఈ పథకం వివరాలు ఇంకా రూపొందుతున్నాయని, ఇది మోదీ ప్రభుత్వ వేగవంతమైన విధానానికి సరైన ఉదాహరణ అని పేర్కొంది. అలాగే పశ్చిమాసియాలో చిక్కుకున్న భారతీయులను వెనక్కి రప్పించేందుకు భారత్ అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందని అన్నారు. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న సుమారు కోటి మంది భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టినట్టు వివరించారు. కాగా, పశ్చిమాసియా సంక్షోభం పార్లమెంట్ ఉభయ సభలను సోమవారం కుదిపేసింది. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై చర్చకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు రాజ్యసభ, లోక్‌సభలో నిరసనలు చేపట్టాయి. దీంతో పార్లమెంట్ ఉభయ సభలు మంగళవారానికి వాయిదా పడ్డాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తున్నాయని బీజేపీ ఎంపీలు ఆరోపించారు.

# ప్రజాసేవలో ఎప్పుడూ పోలీసులే ముందు

(మొదటి పేజీ తరువాయి)

విశ్లేషించుకున్నట్లు సిఎం తెలిపారు. ఛాలెంజ్ లు రెండు రకాలు.. ఒకటి టెక్నికల్ ఛాలెంజ్, రెండోది అడాప్టివ్చాలెంజ్ అన్నారు. రిసోర్సెస్, సమయాన్ని కేటాయిస్తే టెక్నికల్ ఛాలెంజ్ ను అధిగమించవచ్చన్నారు. కానీ అడాప్టివ్చాలెంజ్ విషయంలో ఎదురైన సమస్య లోతును అర్థంచేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే శాంతిభద్రతలు అదుపులో ఉండాలన్నారు. రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ ఉండకూడదనే తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ డాక్యుమెంట్ ను ఆవిష్కరించుకున్నామని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించడానికి ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న 2100కి.మీ ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ గా పరిగణించుకుంటున్నాం అని అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమిగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని అన్నారు. దేశంలో ఢిల్లీ అత్యంత కాలుష్య నగరంగా మారింది. ట్రాఫిక్ సమస్యలతో బెంగుళూరు నగరంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముంబై, చెన్నై నగరాలు వరదలతో సతమతమవుతున్నాయి.

అలాంటి మెట్రోపాలిటన్ నగరాల నుంచి మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏ సమస్య వచ్చినా ప్రజలు మొట్టమొదట సహాయం కోసం ఎదురు చూసేది పోలీసుల కోసమేనని అన్నారు. ఒకప్పుడు తీవ్రవాదం ఒక సమస్యగా ఉండేది.. ఇందుకోసం ఆక్టోపస్, గ్రేహౌండ్స్ లాంటి వ్యవస్థలు తీసుకొచ్చారు. అవినీతిని నిరోధించేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఫిజికల్ క్రైమ్ నిరోధించేందుకు ఇప్పటి వరకు వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాం. కానీ ఇప్పుడు నేర స్వరూపమే మారిపోయింది. సైబర్ క్రైమ్ పెరిగిపోతున్న ఈ రోజుల్లో మన సిస్టం ను అప్ గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక నైపుణ్యం ఉన్న అధికారులను నియమించుకోవాల్సిన అవసరం ఉంది. ఉన్న సిబ్బంది, అధికారులను అప్ గ్రేడ్ చేసుకోకపోతే నేరాలను నిరోదించలేమని గుర్తు చేశారు.రిట్రీట్ కార్యక్రమం ద్వారా మీ సమస్యలను గుర్తించి విశ్లేషించుకున్నారు. సమస్య ఏమిటో గుర్తిస్తే 50 శాతం సమస్య పరిష్కారం అయినట్లే. సైబర్ క్రైమ్, నార్కోటిక్స్, రిక్రూట్ మెంట్, ఇతర అంశాలకు సంబంధించి వివిధ సమస్యల పరిష్కారానికి మీరు కొన్ని ప్రతిపాదనలు అందించారు. సమస్యల పరిష్కారానికి మీరు అందించిన ప్రతిపాదనలపై విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక అధికారుల కమిటీ ఏర్పాటు చేస్తాం.. మీ ప్రతిపాదనలపై కమిటీలో విశ్లేషించి చట్టం రూపంలో మా ముందుకు తీసుకు రండి. సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రభుత్వం దానిపై నిర్ణయం తీసుకుంటుంది. పోలీస్ శాఖలో సిబ్బంది రేషనలైజేషన్ చేసుకుని జనాభా ప్రాతిపదికన పోలిసింగ్ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి. అవసరమైన నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంది. మీ పనితీరు ఆధారంగానే పోస్టింగులు ఉంటాయి. ప్రతీ ఏటా డిసెంబరులో రిట్రీట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసునేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

# అత్యున్నతంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ

**హైదరాబాద్,మార్చి 9 :** అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. వర్సిటీ నిర్మాణాలకు సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించారు. దీనికి సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని సదుపాయాలతో స్పోర్ట్స్ వర్సిటీ నిర్మాణాలు ఉండాలి. ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటేలా చర్యలు తీసుకోవాలి. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియాన్ని ఆధునికీకరించాలి. అదేవిధంగా గచ్చిబౌలి ఔట్‌డోర్ స్టేడియాన్ని పునరుద్ధరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్రీడాశాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పనపై అధికారులతో చర్చించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పన, అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై చర్చించారు. ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా రాష్ట్రంలో అన్ని సౌకర్యాలతోపాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణాలు ఉండాలని సీఎం అన్నారు. గచ్చిబౌలి ఔట్ డోర్ స్టేడియంను పునరుద్ధరించడం తో పాటు, స్టేడియం ఆవరణలో ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ కాంప్లెక్స్, హాస్టల్ భవనాలు, అన్ని రకాల క్రీడా మైదానాలు, శిక్షణకు అవసరమైన ఇతర సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా నిర్మాణాలకు సంబంధించి పలు డిజైన్లను పరిశీలించారు. డిజైన్లకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేసారు. ఒలంపిక్స్, కామన్ వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా, ఒలంపిక్స్ లో తెలంగాణ క్రీడాకారుల సత్తా చాటడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నగరంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, ఎల్బీ స్టేడియం, సరూర్ నగర్ స్టేడియంలను భవిష్యత్ అవసరాలు, శిక్షణ, పోటీలకు అనుగుణంగా ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేంనరేందర్ రెడ్డి, శాప్ చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శ్రీనివాస రాజు, శేషాద్రి, ఎండీ సోనీ బాలదేవి, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి. కిషోర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కవితకు మళ్లీ నోటీసులు!

**న్యూఢిల్లీ,మార్చి 9 :**ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కల్వకుంట్ల కవిత సహా 23 మంది నిందితులకు ఢిల్లీ హైకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. రౌస్ అవెన్యూ కోర్టు నిందితులకు ఊరట కలిగిస్తూ ఇటీవల ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన కోర్టు, ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ.. తదుపరి విచారణను మార్చి 16వ తేదీకి వాయిదా వేసింది. సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మోహతా వాదనలు వినిపించారు. ఇటీవల ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఈ కేసులో నిందితులుగా ఉన్న ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, కల్వకుంట్ల కవితతో పాటు మొత్తం 23 మందిపై సీబీఐ అభియోగాలను డిశ్చార్జ్ చేస్తూ వారికి ఊరట కలిగించడం తెలిసిందే. అయితే ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో నిందితులకు అనుకూలంగా రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కేసు విచారణలో భాగంగా నిందితులపై ఉన్న అభియోగాలను మరింత లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని, కింది కోర్టు నిర్ణయంపై స్టే ఇవ్వాలని సీబీఐ కోరింది. దీనిపై స్పందించిన ఢిల్లీ హైకోర్టు, నిందితులు విచారణకు హాజరు కావాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. ఇటీవల రౌస్ అవెన్యూ కోర్టు లిక్కర్ స్కాం కేసులో కీలక వ్యాఖ్యలు చేసింది. దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లలోని కొన్ని అంశాలపై స్పష్టత లేదని, సాక్ష్యాధారాల సేకరణలో జాప్యం జరుగుతోందని కోర్టు అభిప్రా యపడింది. కొందరు నిందితులు తమపై ఉన్న కేసులను కొట్టివేయాలని (డిశ్చార్జ్) కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లపై రౌస్ అవెన్యూ కోర్టు సానుకూలంగా స్పందిం చింది. కేవలం ఆరోపణలతో కేసు దర్యాప్తు జరిగిందని, తగినన్ని ప్రాథమిక ఆధారాలు లేకుండా నిందితులను ఎక్కువ కాలం జైల్లో ఉంచడం లేదా విచారణను సాగదీయడం సరికాదని కోర్టు పేర్కొంది. ఈ క్రమంలోనే 23 మంది నిందితులపై ఉన్న అభియోగాలను కోర్టు కొట్టివేస్తూ వారి లిక్కర్ పాలసీ కేసు నుంచి విముక్తి కల్పించింది. సీబీఐ ఇప్పుడు ఈ అంశాలన్నింటినీ ఢిల్లీ హైకోర్టులో సవాలు చేస్తోం ది. ఆప్ ప్రభుత్వం హయాంలో జరిగిన లిక్కర్ పాలసీ స్కామ్‌లో భారీగా ముడు పులు చేతులు మారాయని, దీని వెనుక ఉన్న 'సౌత్ గ్రూప్', ఇతర రాజకీయ నేతల ప్రమేయాన్ని నిరూపించడానికి మరింత లోతుగా దర్యాప్తు జరగాలని సీబీఐ వాది స్తోంది. ఈ కేసు తదుపరి విచారణ మార్చి 16కు ఢిల్లీ హైకోర్టు వాయిదా వేసింది.

# సీఈసీపై అభిశంసన..
# తీర్మానానికి సిద్ధమవుతున్న విపక్షాలు

● ఈ వారంలోనే నోటీసు ఇచ్చే అవకాశం



**న్యూఢిల్లీ,మార్చి 9 :** చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ తొలగింపునకు పార్లమెంట్‌లో తీర్మానం ప్రవేశపెట్టేందుకు ప్రతిపక్ష పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఈ తీర్మానానికి సంబంధించిన ముసాయిదా సిద్ధమైందని, ఈ వారంలోనే నోటీసు ఇచ్చే అవకాశముందని తెలిసింది. ప్రతిపక్షాలన్నీ కలిసికట్టుగా, ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నాయని టీఎంసీ సీనియర్ ఎంపీ వెల్లడించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా అభిశంసన తీర్మానం ముసాయిదా సిద్ధమైందని అన్నారు. ఒకేసారి రెండు సభల్లో ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.ఎన్నికల కమిషనర్ తన పదవిని పూర్తిగా దుర్వినియోగం చేశారని ఆ నాయకుడు ఆరోపించారు. ఇండియా కూటమిలోని ఇతర పార్టీలన్నీ ఈ అభిశంసన తీర్మానానికి అనుకూలంగా ఉన్నాయని, ముసాయిదా రూపకల్పనలో భాగస్వామ్యమైనాయని తెలిసింది. తీర్మానంపై అన్ని పార్టీల నాయకులు ఎంపీల సంతకాలను సేకరించనున్నారు. లోక్‌సభ నుంచి కనీసం 100, రాజ్యసభ నుంచి కనీసం 50 మంది సంతకాలు అవసరమని ఓ నాయకుడు తెలిపారు. పార్లమెంట్ ద్వారా హైకోర్టు లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించేందుకు అనుసరించే విధానమే సీఈసీ తొలగింపునకు కూడా వర్తిస్తుందని అన్నారు.

# ఇరాన్ కొత్త సుప్రీంగా మొజ్తబా

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ నిపుణుల బృందం ఎన్నుకుంది.ఇందులో 88 మంది ఇస్లాం మత గురువులు ఉంటారు. వీరందరూ కలిసి ఆదివారం సమావేశమై కొత్త సుప్రీం లీడర్ కోసం చర్చ జరిపారు. మెజారిటీ సభ్యులు మొజ్తాబా వైపు మొగ్గు చూపారు. కొందరు సభ్యులు వారసత్వ నాయకత్వాన్ని వ్యతిరేకించినప్పటికీ.. మెజారిటీ ఉండటంతో మొజ్తాబానే ఎన్నుకున్నారు. ఒకవైపు ఇరాన్‌పై దాడులు కొనసాగుతున్నా, మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ కొత్త లీడర్ ఎంపికను ఇరాన్ పూర్తి చేసింది. అతడు, ఎప్పటినుంచి బాధ్యతలు స్వీకరిస్తారో తెలియరాలేదు. మొజ్తాబాకు విదేశాల్లో భారీగా ఆస్తులున్నాయి. అతడికి లండన్‌లో దాదాపు 2,500 కోట్లకుపైగా ఆస్తులున్నట్లు అంచనా. కెన్సింగ్టన్ ప్యాలెస్‌లో అతడికి ఖరీదైన అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. 2014 నుంచి లండన్‌లో ఆస్తులు కలిగి ఉన్నాడు. అక్రమ చమురు అమ్మకాల ద్వారా ఇదంతా సంపాదించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక ఇటీవలి పరిణామాల నేపథ్యంలో లండన్‌లోని అతడి ఆస్తులపై ఇజ్రాయెల్, అమెరికా నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. అతడి ఆస్తులకు భద్రతాపరమైన ముప్పు ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు మొజ్తాబా ఎంపికను అమెరికా, ఇజ్రాయెల్ అంగీకరించడం లేదు. కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకునేముందు తమ అనుమతి తీసుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచించారు. అలాగే కొత్త లీడర్ ఎవరైనా సరే అంతం చేస్తామని ఇజ్రాయెల్ ఇదివరకే ప్రకటించింది.

# తెలంగాణ నుంచి ఇద్దరు రాజ్యసభకు ఏకగ్రీవం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున వేం నరేంద్ర రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీలు రాజ్యసభకు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. అందుకు సంబంధించిన పత్రాలను వీరికి అందజేసినట్లు తెలిపారు. అభిషేక్ మను సింఘ్వీ తరఫున అడ్వకేట్ సుందర్ చౌహాన్ అందుకున్నారు. వేం నరేందర్ రెడ్డి అసెంబ్లీ కార్యాలయానికి వచ్చి ధృవీకరణ పత్రం స్వీకరించారు. రాజ్యసభలో పలువురి సభ్యుల పదవి కాలం ఏప్రిల్‌లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇటీవల కేంద్ర ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. గురువారంతో నామినేషన్ల ప్రకియ ముగిసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ తరఫున తెలంగాణ నుంచి అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. తెలంగాణ అసెంబ్లీలో ఏర్పాటు చేసిన రాజ్యసభ ఎన్నికల కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డికి వీరు తమ నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఇక.. సాయి అనే వ్యక్తి సైతం ఈ రాజ్యసభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అతడి అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకపోవడంతో.. శుక్రవారం ఆ నామినేషన్‌ను తిరస్కరించారు. అలాగే ఇతరులు ఎవ్వరూ నామినేషన్ల దాఖలు చేయలేదు. దీంతో కాంగ్రెస్ నుంచి నామినేషన్ల దాఖలు చేసిన అభిషేక్, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక ఏకగ్రీవమైంది.

# తిరుమల లడ్డూకు నెయ్యి కొరత లేదు

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన నెయ్యి కొనుగోలు విధానం మూడంచెలుగా జరుగుతోంది. ఒకే సంస్థపై ఆధారపడకుండా మూడు వేర్వేరు సంస్థల ద్వారా నెయ్యి సరఫరా జరుగుతోంది. అందుకు తితిదే ముందుస్తు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం భక్తులకు పంపిణీ చేయడానికి సుమారు 7 లక్షల లడ్డూ ప్రసాదాలు సిద్ధంగా ఉన్నాయి. వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. తితిదే వద్ద నెయ్యి నిల్వలు లేవని, శ్రీవారి కైంకర్యాలు, లడ్డూ ప్రసాదాల తయారీకి ఆటంకం కలుగుతోందని వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దు' అని భక్తులకు విజ్ఞప్తి చేసింది.

# రైతుబంధు పథకం బంద్...రాహుల్ బంద్ స్టార్

(మొదటి పేజీ తరువాయి)

సన్మానించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇళ్లు కూలగొట్టడమేనా అని ప్రశ్నించారు. మూడో పంటకు రైతు బంధు వేయాలన్నారు. కానీ నేటికి మూడో నెల వచ్చిన రైతు బంధు వేయడం లేదని రేవంత్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థిక కష్టాలు ఉన్న మాట నిజమైతే రూ.లక్షన్నర కోట్లతో మూసి సుందరీకరణ ఎవరు చేయమన్నారంటూ రేవంత్ ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. రైతు బంధు మీద దృష్టి పెట్టు.. అంతేకానీ రాహుల్ బంధు మీద కాదంటూ సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ చురకలంటించారు. ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వికలాంగుల ఇళ్లను సైతం నిర్దాక్షిణ్యంగా కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సొంత ఇల్లు, ఆయన సోదరుడి ఇల్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని.. వాటిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుపై కేటీఆర్ వ్యంగ్య బాణాలు సంధించారు. వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి.. వెయ్యి రోజులు కావస్తున్నా అతీగతీ లేదని విమర్శించారు. ఆడబిడ్డల పెళ్లికి తులం బంగారం, రైతులకు పంట బోనస్, మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు.

# గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఘనంగా వీడ్కోలు

**హైదరాబాద్,మార్చి 9 :** మహారాష్ట్ర గవర్నర్ గా బదిలీపై వెళ్తున్న సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ , కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఘనంగా వీడ్కోలు పలికింది. బేగంపేట ఎయిర్ పోర్ట్ లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చాను అందజేసి వీడ్కోలు పలికారు. వారితో కరచాలనం చేసి ఆత్మీయంగా పలకరించారు.

# వెలుగుమట్ల బాధితులతో కవిత ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

జాగృతి అధ్యక్షురాలు కవిత దిగారు. ఈ క్రమంలో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. కవితతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ విశారదన్, పలువురు ఆందోళనకారులను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మం నగరంలో వెలుగుమట్ల ప్రాంతానికి చెందిన భూదాన్ యజ్ఞ బోర్డు భూముల నిర్వాసితులతో కలిసి కవిత సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అంబేద్కర్ సెంటర్ వరకు కొనసాగింది. అక్కడికి చేరుకున్న అనంతరం కవిత అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ ర్యాలీ అనంతరం నిర్వాసితులు ఖమ్మం జడ్పీ సెంటర్ వద్ద ఆందోళనకు దిగారు. తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వారు నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనలో భాగంగా కొంతమంది నిర్వాసితులు రాస్తారోకో నిర్వహించి వాహనాలను అడ్డుకున్నారు. దీంతో జడ్పీ సెంటర్ పరిసరాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించారు. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ చైర్మన్ విశారదన్‌తో పాటు పలువురు నిర్వాసితులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం కవితను నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆందోళనల నేపథ్యంలో ఖమ్మం జడ్పీ సెంటర్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# పదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా పరీక్ష ప్యాడ్స్ పంపిణీ

**– పరీక్షా ప్యాడ్స్ పంపిణీ చేసిన బజారు బిక్షపతి**




(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 9:-రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమి నేడు గ్రామంలో జడ్పిహెచ్ఎస్ హై స్కూల్ విద్యార్థులకు పదవ తరగతి విద్యార్థులకు సోమవారం రోజున ఉచితంగా పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేసిన బజారు బిక్షపతి. ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ. విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని అదేవిధంగా పాఠశాలకు ఉపాధ్యాయులకు గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని బిక్షపతి ఆకాంక్షించారు. హెచ్ ఎం మారోజు సుధాకర్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం లాగా ఈసారి కూడా 100% రిజల్ట్ తీసుకురావాలని కోరారు. నేటి బాలలే రేపటి పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. మన పాఠశాలకు దాత అయినటువంటి బజారు బిక్షపతి ముందుకు రావడం అభినందనీయమన్నారు.

# వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే

**– వేద పండితులచే ఆశీర్వాదం పొందిన మల్ రెడ్డి రంగారెడ్డి**



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 9:- రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో తుర్కయంజాల్ కమ్మ గూడ లోని శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన ఆయన స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితులచే ఆశీర్వాదాలు పొందారు. అనంతరం ఆలయ పూజారులు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి తీర్థప్రసాదాలు అందించి, వేదమంత్రాల నడుమ ఆశీర్వచనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలందరికీ శ్రేయస్సు కలగాలని స్వామి వారిని ప్రార్థించినట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుంటున్నారు

**– టీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిత్రం సురేష్**





హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి చంపాపేట్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ మున్సిపల్ సంఘం (టీఎంఎస్) ఆధ్వర్యంలో తెలంగాణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిత్రం సురేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి మహిళా దినోత్సవ సంబరాలలో కేక్ కట్ చేసి ఆటపాటలతో ఘనంగా సంబరాలు జరిగేలా చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ పూర్వం ఇంటికే పరిమితమైన మహిళలు ఈరోజు అన్ని రంగాలలో పురుషులకు ముందంజలో ఉంటున్నారు. ప్రభుత్వ ప్రైవేటు రంగంలో గానీ, రాజకీయాల్లో రంగంలో గానీ, పారిశ్రామిక, క్రీడా మరియు ఇతర రంగాలలో మహిళలు తమ తమ శక్తి సామర్థ్యాలను ప్రదర్శిస్తూ తమ సత్తా చాటుకుంటున్నారని మహిళలు గొప్పతనాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమం అనంతరం మహిళా కార్మికులకు తెలంగాణ మున్సిపల్ సంఘం (టీఎంఎస్) తరుపున సంఘం అధ్యక్షులు చీరలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు శరత్ సతీష్ శివ శ్రీకాంత్ కార్తీక్ మరియు మహిళా కార్మికులు బాలమ్మ నీలమ్మ రేణుక మాయమ్మ మొదలైన వారు పాల్గొన్నారు.

# హయత్ నగర్ సినర్జీ ఆఫీసులో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పెరిక కుల ఎల్బీనగర్ జోన్ మహిళలకు చేసిన ఘన సత్కారం,... యల్ బి నగర్ పెరిక (పురగిరి క్షత్రియ)కుల సంఘము ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ బుద్దె వెంకటేశ్వర్లు







హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి :దాచేపల్లి రవి, తెలంగాణ రిపోర్టర్స్ ఇంచార్జి : ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘ అతిరథ మహారథులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఘటిక విజయకుమార్ గారుమాట్లాడు తూ మహిళా దినోత్సవ సందర్భంగా మాట్లాడుతూ, కథన రంగంలో కత్తి పట్టిన కాంతలుగా సమ్మక్క సారలమ్మలను గుర్తు చేసారు,

ప్రస్తుతం స్త్రీల పరిస్థితి వివరిస్తూ నేటి సమాజం హిపోక్రాటిక్ విధానంలో మహిళా హక్కులని వంద కిలోమీటర్ల లోతులో పాతి పెట్టిందని, దానికి గల కారణం వారసులుగా పుట్టే ఎవరైనా తండ్రి పేరును, తండ్రి గోత్రాన్ని మాత్రమే తర్వాతి తరానికి ఇస్తారని తల్లి గోత్రాన్ని తల్లి పేరు కానీ తర్వాతి తరానికి ఇవ్వరని, రాజకీయ రంగంలో మహిళా రిజర్వేషన్ వచ్చి గెలుపొందిన తర్వాత చేసే ప్రజా కార్యక్రమాలలో వేసే ప్రతి ఫౌండేషన్ స్టోన్ పేరమీద మహిళ పేరు తర్వాత భర్త పేరు పెడతారు,

అదే సందర్భంలో పురుషుడు గెలిస్తే స్త్రీ పేరు పెట్టారని, ఇద్దరు ఆడ పిల్లలు పుట్టిన తర్వాత కూడా మూడో కాన్పులోనైనా పురుషుడు పుట్టాలి అని భావించే వారి ఆలోచన మారానంతవరకు మహిళా సాధికారత సాధ్యం కాదని పేర్కొన్నారు. వారి మాతృమూర్తి సుగుణమ్మ జడ్పీటీసీ గా పనిచేసి పేరు తెచ్చుకుంది కాబట్టే వారికి సుగుణమ్మ వారసులుగానే అందరికీ సుపరిచితులని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం గౌరవ అధ్యక్షులు మద్దా లింగయ్య గారు మాట్లాడుతూ. తన తల్లి లేనిదే తాను లేను అని, చమ్మగిల్లిన తన మాటలతో సభలో ఉన్న ప్రతి ఒక్కరి హృదయాన్ని ద్రవింపజేశారు, కోకాపేట భవన చైర్మన్ సుందరి వీరభాస్కర్ గారుమాట్లాడుతూ, తనకు జన్మనిచ్చిన తల్లి తనకు అనునిత్యం తోడుగా ఉంటున్న భార్య వీరిద్దరి వల్లనే తాను ఉన్నత శిఖరాలని చేరుకోగలిగానని, వ్యాపారంలో లాభాలు వచ్చినా నష్టాలు వచ్చినా నిద్రలేని రాత్రులు గడిపిన ఎల్లవేళలా తనకు తోడుగా ఉంటూ ఉత్తమ బిజినెస్ అవార్డు 2026 గ్రహీతగా నిలబెట్టడంలో తన సతీమణి పాత్ర మర్చిపోలేనిది అని గుర్తు చేసుకున్నారు, ఎన్ని తెలివితేటలు ఉన్నా ఎంత మేధావులమైన పురుషులు పిల్లలకు సమయం ఇచ్చే సందర్భాలు తక్కువగా ఉంటాయని ఆ అనితర బాధ్యతని స్త్రీ తన భుజాల మీద మోస్తుంది అని చెప్పారు. ఎల్బీనగర్ జోన్ మహిళా మణులు అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహించారు అని భవిష్యత్తులో కూడా ఇలాంటి అవసరం ఉన్నా ప్రతి సందర్భంలో తన వంతు సహకారాన్ని అందిస్తానని చెప్పారు.

రాబోయే రోజుల్లో ఎల్బీనగర్ ప్రాంతంలో లేడీస్ హాస్టల్ ఏర్పాటు చేస్తామని అందులో మహిళా మణులకు మీటింగ్ హాల్ ఉంటుంది అని,ఒకవేళ రాష్ట్రవ్యాప్తంగా కూడా మీటింగ్ పెట్టుకుంటే కోకాపేట భవనం కూడా భవిష్యత్తులో సిద్ధంగా ఉంటుంది అని ఉపోద్ఘాపించారు.ఎల్బీనగర్ జోన్ అధ్యక్షులు బుద్దె వెంకటేశ్వర్లు గారు మాట్లాడుతూఎల్బీనగర్ ప్రాంతంలో ఉన్న పెరిక కుల మహిళా మణులు తమ యొక్క బాధ్యతని సక్రమంగా నిర్వహిస్తూ వారి పిల్లల భవిష్యత్తుకి, కుటుంబానికి తోడ్పాటును అందిస్తూ వారి ఉద్యోగాలకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తూ అనితర బాధ్యతను భుజాల మీద మోస్తూ అమ్మతననికి అందం తెచ్చారు అని చెప్పారు. మహిళా దినోత్సవ వేడుకకు అద్భుతమైన హాల్ ని బహుమతిగా ఇచ్చి భవిష్యత్తులో కూడా తమకు అవసరమైన సహకారాన్ని అందిస్తానని చెప్పిన సుందరి వీరభాస్కర్ గారికి ఎల్బీనగర్ జోన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది, పెరిక కుల సంఘం ఎల్బీనగర్ జోన్ మహిళా అధ్యక్షురాలు యగ్గడి నాగమణి గారు మాట్లాడుతూ ప్రతి పనిలో స్త్రీ ప్రాధాన్యత అనివార్యమని, స్త్రీ లేనిదే జననం లేదని సమస్త మానవాళికి స్త్రీనే మూల కారణమని, ఉమెన్ లో మెన్ ఉన్నదని చెప్పడం జరిగింది. లినేషనల్ బిజినెస్ అవార్డు 2026 సంవత్సరం గాను సుందరి వీరభాస్కర్ గారు విజేత నిలవడాన్ని కొనియాడుతూ,

అందమైన హాల్ ని మహిళల కోసం కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆద్యాంతం సభను నడిపించి సక్సెస్ చేసిన మహిళా మణులు మహిళా విభాగశీ ఎల్బీనగర్ జోన్ జనరల్ సెక్రెటరీ ఎర్రంశెట్టి శ్రీలత గారు, ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మీ ప్రసన్న గారు గౌరవ అధ్యక్షురాలు అందే వరలక్ష్మి గారు, అసోసియేటివ్ అధ్యక్షులు బాల్దూరి వసంత గారు, డాక్టర్ సరిత గారు భాగ్యలక్ష్మి గారు చాలా అద్భుతంగా మాట్లాడుతూ మహిళల యొక్క ఔన్నత్యాన్ని ప్రగతి పథంలో వారి ప్రాధాన్యతని ప్రస్ఫుటంగా వివరించారు ఈ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఘటిక విజయకుమార్ గారు , మాజీ అధ్యక్షులు శ్రీరామ్ దయానంద గారు , తెలంగాణ రాష్ట్ర పెరిక కుల గౌరవ అధ్యక్షులు మద్ద లింగయ్య గారు , కోకాపేట భవన నిర్మాణ చైర్మన్ సుందరి వీరభాస్కర్ గారు , ప్రధాన కార్యదర్శి దొంగరి మనోహర్ గారు , అసోసియేటివ్ అధ్యక్షులు సుంకరి ఆనంద్ గారు , ప్రధాన కార్యదర్శి అచ్చా రఘు గారు , పెద్దలు అంకతి విజయ్ కుమార్ గారు, సంక్షేమ సమితి అధ్యక్షులు బత్తిని పరమేష్ గారు, ప్రచార కార్యదర్శి దొంగరి శంకర్ గారు, కోశాధికారి బల్దూరి రవికుమార్ గారు , గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు డాక్టర్ సతీష్ గారు , గ్రేటర్ హైదరాబాద్ గౌరవ అధ్యక్షులు గుండు వెంకటేశ్వర్లు గారు,

కేశవ్ గారు , ఎల్బీనగర్ జోన్ సభ్యులు ప్రధాన కార్యదర్శి ముత్తినేని వెంకటేశ్వర్లు అసోసియేట్ అధ్యక్షులు యగ్గడి శ్రీనివాస్ గారు,యూత్ అధ్యక్షులు జుకూరు మహేష్ గారు,ముఖ్య సలహాదారుడు బొలిశెట్టి లక్ష్మీనారాయణ గారు ఉపాధ్యక్షులు మద్దెల వినయ్ గారు, రామినేని శ్రీనివాస్, మహేష్ గారు తదితరులు పాల్గొన్నా రు..

# అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు టి యు టి యఫ్ ఆధ్వర్యంలో



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి :వరంగల్ :తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టి యు టి యఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు గారి అధ్యక్షతన ప్రభుత్వ ఉన్నత పాఠశాల సుబేదారి నందు అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయ సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నింగి నేలలో సగభాగం అయిన మహిళలు ఏ విషయంలో భయపడకుండా అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఉన్నతస్థానం లో ఉండాలని ఆకాంక్షించారు. స్త్రీ విద్యావంతురాలైతే కుటుంబం అన్ని విధాలుగా ఉన్నత స్థాయికి చేరుతుందని మన పాఠశాలల్లోకి వచ్చే బాలికలు ఉన్నతంగా చదివే ఆ విధంగా చూడాలని సమాజంలో అన్ని పరిస్థితులను ఎదుర్కొనే విధంగా తయారు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ధారా గణేష్, హన్మకొండ జిల్లా అధ్యక్షులు నూతనకంటి బాబు, ప్రధాన కార్యదర్శి దామెర భిక్షపతి,



హైదరాబాద్ జిల్లా గౌరవాధ్యక్షురాలు యర్రంశెట్టి స్నేహ, జిల్లా ప్రధాన కార్యదర్శి చిత్తలూరి వెంకటేశ్వరరావు, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు పంబల్ల రాజు, ఉపాధ్యాయునిలు జ్యోతి, శ్రీవిద్య, లలితాంబ, మంజుల, దీపికా, కవిత, గీతిక, స్వర్ణలత పాల్గొన్నారు.

మంగళవారం, మార్చి 10, 2026

RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

హైద్రాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పెండింగ్ ఫైళ్లను త్వరగా పరిష్కరించాలి

**- శంషాబాద్ మున్సిపల్ నీ సందర్శించిన కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**





(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 9:-రంగారెడ్డి జిల్లా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులను కొనసాగిస్తూ కార్యాలయాలలో పెండింగ్ ఫైళ్లను త్వరగా పరిష్క రించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు.
సోమవారం జిల్లాలోని శంషాబాద్ మున్సిపల్ పరిధిలో చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శంషాబాద్ లోని మున్సిపల్ కమ్యూనిటి హాల్ ను, బస్తి దవాఖాను సందర్శించి ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా అక్కడ చేపట్టిన పనులను పరిశీలించారు. బస్తీ దవాఖానకు వచ్చే వారికి అందిస్తున్న వైద్యం వివరాలు, మందుల వివరాలు డాక్టర్లను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బస్తీ దవాఖానలో చేస్తున్న రక్త పరీక్షలు, అందిస్తున్న వైద్య సేవలు, మందుల గురించి దవాఖానకు వచ్చిన వారిని అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు నిర్వహించిన వివరాలు రిజిస్టర్ నందు నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రతగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 12వ తేదీ వరకు ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలలో 99 రోజుల పాటు కార్యచరణ అమలు చేయాలని, పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ లో ఉన్న ఫైళ్లను పూర్తిగా పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వ శాఖల అధికారులు వారి పరిధిలోని అంశాలపై ప్రణాళికలు సిద్ధం చేసి దశల వారీగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి కార్యాలయంలో ప్రజపాలన ప్రగతి ప్రణాళిక పనులు పక్కాగా అమలు చేయాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, ప్రతి కార్యాలయంలో అవసరమైన చోట ఏమైనా మరమ్మత్తులు, పెయింటింగ్ పనులు ఉంటే పూర్తి చేయాలని, ఎక్కడ ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని సూచించారు. రోజు వారీగా సేకరించిన తడి, పొడి చెత్తను సెగ్రిగేషన్ కేంద్రాలకు తరలించాలని, నీటి నిల్వలు లేకుండా, దోమలు పెరగకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు.కలెక్టర్ వెంట శంషాబాద్ మున్సిపల్ జోనల్ కమిషనర్ చంద్రకళ, రాజేందర్ నగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డి, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లలితా దేవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమీకృత జిల్లా కార్యాలయం ప్రజావాణికి 99 ఫిర్యాదులు



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 9:- రంగారెడ్డి జిల్లా ప్రజావాణికి (99 ) ఫిర్యాదులు, ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి



జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులుఅందజేసిన అర్జీలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో కలసి స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందిస్తూ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ --19,
ఇతర శాఖలకు --80, మొత్తం 99 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్లు ఇళ్ల స్థలాలు కోసం భూ పోరాటం: సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**- రణరంగంగా మారిన ఎల్బీనగర్ చౌరస్తా**

**జాన్ వెస్లీ తో పాటు పలువురు సిపిఐ(ఎం ) నేతలను**

**- అదుపులోకి తీసుకున్న పోలీసులు**




ఎల్బీనగర్ : ఎల్బీనగర్ లో ఉన్న పేదలకు ఇండ్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని మహా ప్రజా యాత్ర సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో చలో ప్రజా భవన్ కార్యక్రమం చేపట్టడం జరిగింది
ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వకుంటే సిఎం రేవంత్ రెడ్డిని కూడా కేసిఆర్ మాదిరిగా ఇంటికి పంపిస్తామని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హెచ్చరించారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు కోసం సిపిఐ(ఎం) ఎల్బీనగర్,సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఎల్బీనగర్ నుంచి ప్రజా భవన్ వరకు పాదయాత్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన జాన్ వెస్లీ మాట్లాడుతూ పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వమని మాజీ సిఎం కేసిఆర్ ను అధికారంలో ఉండగా అడిగితే అరెస్టు లు చేయడం జరిగింది అన్నారు. ఈ కారణంగానే నాటి సిఎం కేసిఆర్ ను కమ్యూనిస్టులు ఇంటికే పరిమితం చేశారు అని ఆయన అభిప్రాయపడ్డారు. నాటి కమ్యునిస్టు పోరాటాలకు నేటి సిఎం రేవంత్ రెడ్డి పలుమార్లు మద్దతు తెలిపిన విషయాన్ని జాన్ వెస్లీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. అధికారంలోకి రావడానికి అడ్డగోలుగా హామీలు ఇచ్చి నేడు ఆరు గ్యారంటీ పథకాలు అడిగితే అరెస్టు లు చేస్తున్నారు అని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా అమ్ముతున్న సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పేదల పక్షాన ఇచ్చిన హామీలను గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కేసిఆర్ కార్పొరేట్లకు ధారాదత్తం చేసిన ప్రభుత్వ భూములను తిరిగి పేదలకు పంపిణీ చేస్తానని చెప్పిన విషయం వాస్తవం కాదా అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం కనీసం డబుల్ బెడ్ రూమ్ లు అయిన నిర్మించింది అయితే రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేద మధ్యతరగతి ఇళ్లను కూల్చడమే ప్రభుత్వ లక్ష్యంగా మారింది అన్నారు. కేసీఆర్ నిర్మించి ఖాళీగా ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులైన పేదలకు కేటాయించాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీ పథకాల్లో భాగంగా అర్హులైన పేదలు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని నేటికీ ఇందిరమ్మ ఇళ్ల పై విచారణ లేదని ఆయన వివరించారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తో పాటు పలువురు సిపిఐ (ఎం) నాయకులను అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఎల్బీనగర్ చౌరస్తా నుంచి ప్రజా భవన్ వరకు కొనసాగుతున్న పాదయాత్రను పోలీసులు దౌర్జన్యంగా అడ్డుకున్నారు అని ఆయన ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పేదలకు కమ్యూనిస్టులు పంచిపెట్టిన ప్రభుత్వ భూములను తెలంగాణ ప్రభుత్వం దర్జాగా అమ్ముకుంటుందని ఆయన విమర్శించారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మహిళలపై కూడా పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రమోహన్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఎల్బీనగర్, సర్కిల్ కమిటీల. పలువురు నేతలు పాల్గొన్నారు.
రణరంగంగా మారిన ఎల్బీనగర్ చౌరస్తా సిపిఐ(ఎం) తలపెట్టిన పాదయాత్రను పోలీసులు అనుమతి లేదని అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు పార్టీ నేతలను అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించగా పార్టీ శ్రేణులు ముఖ్యంగా మహిళలు పోలీసులను అడ్డుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రమోహన్ తదితరులను పోలీసులు బలవంతంగా అదుపులో తీసుకోవడంతో చౌరస్తాలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. శాంతియుతంగా పాదయాత్ర చేస్తామని ఎటువంటి ఆందోళనలకు దిగమని రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పోలీసులకు ఎంత సర్ది చెప్పిన పోలీసులు వినిపించుకోలేదు. అదుపులోకి తీసుకున్న పార్టీ నాయకులను పోలీసులు ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. విషయం తెలుసుకున్న పార్టీ నేతలు, కార్యకర్తలు, మహిళలు ఎల్బీనగర్ చౌరస్తా నుంచి ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ కు చేరుకున్నారు. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని పోలీస్ స్టేషన్ ముందు మహిళలు పెద్ద సంఖ్యలో బైఠాయించారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఎల్బీనగర్ ఏసిపి కృష్ణయ్య, ఎల్బీనగర్ ఇన్స్ పెక్టర్ వినోద్ కుమార్ లు సిపిఎం నేతలతో చర్చలు జరిపారు. పాదయాత్రకు అనుమతి లేని కారణంగానే శాంతి భద్రతలు కారణంగా పాదయాత్రను అడ్డుకున్నామని ఏసిపి, ఇన్స్ పెక్టర్ లు సిపిఎం నేతలకు వివరించారు. అనంతరం పిఎస్ ముందు బైఠాయించిన మహిళలనద్దేసించి ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్యమాట్లాడుతూ అరెస్టు లు, జైళ్లు కమ్యూనిస్టులకు కొత్త కాదని ఇళ్లు ఇళ్ల స్థలాలు వచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ కమిటీ పి రామస్వామి. బి కాశయ్య, ఏం రాధమ్మ, లక్ష్మణ్, గంగమ్మ పద్మ, అంజి రాథోడ్, శ్రీ ముత్యం, రేణుక, వెంకటమ్మ, రాములమ్మ ఎల్బీనగర్ సర్కిల్ నుండి ప్రజలు 700 మంది సాగర్ రింగ్ రోడ్డు నుండి ఎల్బీనగర్ రింగ్ రోడ్డు వరకు ర్యాలీగా వెళ్లడం జరిగింది తదితరులు పాల్గొన్నారు పత్రిక మిత్రులకు వందనాలతో మీ ఆలేటి ఎల్లయ్య ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి సిపిఎం

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ

**- అబ్దుల్లాపూర్మెట్ సర్పంచ్ మందుగుల విజయ శ్రీశైలం గౌడ్**



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 9:- ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలోలి భాగంగా రేపు ఉదయం 10:00 గంటలకు అబ్దుల్లాపూర్ మెట్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ నిర్వహించబడుతుంది. ఈ గ్రామ సభలో గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్య అంశాలు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలు వంటి విషయాలపై చర్చించబడుతుంది. కాబట్టి గ్రామ ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు, యువత, నాయకులు, పాలకవర్గం సభ్యులు తప్పనిసరిగా హాజరై తమ సూచనలు, అభిప్రాయాలు తెలియజేసి గ్రామ అభివృద్ధికి సహకరించగలరని మనవి చేస్తున్నాము. మీ భాగస్వామ్యం గ్రామ అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుంది. అనిమందుగుల విజయ శ్రీశైలం గౌడ్సర్పంచ్, అబ్దుల్లాపూర్ మెట్ గ్రామం. తెలియజేశారు.

# తెలంగాణలో అన్ని సౌకర్యాలతో స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణాలు ఉండాలి

**- తెలంగాణ ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ఆదేశించారు**



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 9:- ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా తెలంగాణలో అన్ని సౌకర్యాలతో పాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణాలు ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాలిచ్చారు. ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యమిచ్చేలా, ఒలంపిక్స్లో రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటడమే లక్ష్యంగా క్రీడా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. క్రీడలకు అవసరమైన మైదానాలు, యూనివర్సిటీ, శిక్షణ తదితర అంశాలపై క్రీడా శాఖకు సంబంధించి ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమావేశంలో సమీక్షించారు. రాష్ట్రంలో తలపెట్టిన యంగ్ ఇండియా స్పోర్ట్స్



యూనివర్సిటీ అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన మైదానాలతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించడంపై చర్చించారు. ఈ సందర్భంగా నిర్మాణాలకు సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించిన ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. గచ్చిబౌలి ఔట్డోర్ స్టేడియంను పునరుద్ధరించడంతో పాటు, స్టేడియం ఆవరణలో ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ కాంప్లెక్స్, హాస్టల్ భవనాలు, అన్ని రకాల క్రీడా మైదానాలు, శిక్షణకు అవసరమైన ఇతర సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.నగరంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, ఎల్బీ స్టేడియం, సరూర్నగర్ స్టేడియంలను భవిష్యత్ అవసరాలు, క్రీడాకారులకు శిక్షణ, పోటీలకు అనుగుణంగా ఆధునీకరించాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి,
స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కిషోర్ తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# శంషాబాద్ తహశీల్దార్ కార్యాలయంలో శుభ్రత పనులు






(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 9:-ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి శంషాబాద్ తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్ రెడ్డితో కలిసి కార్యాలయ పరిసరాలను పరిశీలించి, అక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి మరియు శుభ్రత పనులపై అధికారులకు సూచనలు ఇచ్చారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన వాతావరణం కల్పించడం లక్ష్యంగా కార్యాలయ భవనంలో వైట్ వాషింగ్ పనులు చేపట్టాలని నిర్ణయించారు. అందులో భాగంగా సోమవారం వైట్ వాషింగ్ పనులను ప్రారంభించడంతో పాటు కార్యాలయం మరియు పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక శుభ్రపరిచే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు పరిశుభ్రంగా, సక్రమంగా ఉండటం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమని తెలిపారు. ప్రజలు కార్యాలయాలకు వచ్చినప్పుడు సౌకర్యవంతమైన వాతావరణం ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా కార్యాలయ సిబ్బంది కూడా తమ కార్యాలయాన్ని శుభ్రంగా ఉంచేందుకు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థ వంతంగా అమలు కావడానికి అందరూ సమన్వయంతో పనిచే యాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికా రులు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# కచ్చిర్ కాడి ముచ్చట్లు



### విమర్శనూ హ్యాపీగాస్వీకరిద్దాం

మనలో చాలామందికి విమర్శ అంటేనే ఒక నచ్చని పదం.
తామేది చేసినా ఎవరైనా తప్పు పట్టడం అస్సలు వారికి నచ్చదు.
తాము చేసే ప్రతీది ఒప్పే అనుకుంటారు ఎవరైనా విమర్శిస్తే ఉలిక్కి పడతారు.
ఉడికిపోతారుకానీ అలలు లేని సముద్రం కష్టాలు లేని జీవితం ఎక్కడా ఉండదు కదా!
అలాగే చేసే పనుల్లో అనేక రకాల అవాంతరాలు రావడం సహజమే.
కానీ ఎప్పుడూ మనం చేసే మన పని మనకు కరెక్ట్ గానే అనిపిస్తుంది.
ఎవరైనా దానిని తప్పని చెప్పినా, ఒప్పుకోలేము విమర్శించినా తట్టుకోలేము. మొండిగా వాదిస్తాము కూడా.....అవునా... కాదా....
తెలిసో తెలియకో తప్పులు చేయని మనిషుండడు
ఈ లోకంలో.......
ఒక్కోసారి మన ప్రమేయమేమీ లేకున్నా మాట పడాల్సి రావచ్చు.
కానీ మనం గుర్తుంచుకోవాల్సింది ఒక్కటే ప్రశంశల్ని ఎలాగైతే స్వీకరించి ఆస్వాదిస్తామో......!
విమర్శలనీ అలాగే సహృదయం తో స్వీకరించాలనీ
మన పెద్దలన్నారు.
స్వీయలోపం బెరుగుట పెద్ద విద్య అని.....
ముందుగా మన తప్పుల్ని మనం తెలుసుకోవడం చాలా గొప్ప విషయం.....
అది తెలిసిన నాడు మనల్ని ఎవరైనా విమర్శించినా మన మనస్సు ప్రశాంతంగా ఉంటుంది కూడాఎదుటి వారి విమర్శలో నిజం ఉంటే ఆత్మ విమర్శ చేసుకుని లోపాల్ని సరిదిద్దు కోవాలి.....దాంతో మనల్ని మనం మెరుగుపరచు కునే అవకాశం లభిస్తుంది......
అన్నింటిని చూసే మన కన్నే తనను తాను చూసుకోలేదు కదా!
అలాగే అందరి తప్పుల్ని వెదికి పట్టుకునే మనం మన తప్పుల్ని తెలుసుకోలేము....
వేమన అన్నట్టు “తప్పులెన్ను వారు తండోప తండంబు,
లుర్విజనులకెల్ల నుండు తప్పులెన్ను వారుతమ తప్పులెరుగరు విశ్వదాభిరామ వినుర వేమా....!
కానీ. ముందుగా మన తప్పులు తెలుసుకోవాలంటే ఎదుటి వారి మాటలకు విలువివ్వాలి,
వారు చెప్పే దాంట్లో నిజముంటే అర్థం చేసుకోవాలి.
నిజాయితీగా ఆత్మ విమర్శ చేసుకోవాలి.
అప్పుడే మన వ్యక్తిత్వం వికసిస్తుంది,
నలుగురిలో మన గౌరవం రెట్టింపవుతుంది.
మంచి విమర్షను గుర్తించినట్టే స్వార్థం తోనే,ఈర్ష్యతోనో కొందరు చేసే కువిమర్శల్ని సైతం పసిగట్టగలగాలి. ఆత్మ విశ్వాసాన్ని దెబ్బ తీసే అలాంటి విమర్శలకు దూరంగా ఉండాలి ఇంకా చెప్పాలంటే అస్సలు పట్టించుకో కూడదు కూడా.......!
సాధారణంగా మనిషి నైజం ఎలా ఉంటుందంటే ఎదుటి వారిని విమర్శించడానికి అత్యుత్సాహం చూపుతాడు, కానీ అదే తనదాకా వస్తే ఎక్కడలేని ఆవేశానికి లోనవుతాడు. విమర్శించే వాళ్లయినా, విమర్శను స్వీకరించే వాళ్లయినా గుర్తుంచుకోవాల్సిన విషయం ఒకటుంది., “విమర్శ”ఎప్పుడూ మెదడు మీద పనిచేయాలి గాని హృదయం మీద కాదనేది మనిషిని విమర్శ ఆలోచింపచేయాలి కానీ బాధ పెట్టకూడదు.
అప్పుడే ఆ విమర్శ ఆత్మ విమర్శకు దారితీస్తుంది మనల్ని మనం సంస్కరించుకునే అవకాశం లభిస్తుంది. పుట్టుకతోనే ఎవరమూ మహానుభావులము కాముకదా!! ఒక్కో ఇటుకా పేర్చి ఇల్లు కట్టుకున్నట్లే ఒక్కో సద్గుణాన్ని అలవర్చుకుంటూ వ్యక్తిత్వాన్ని నిర్మించుకుంటాడు మనిషి. అందుకే విమర్శను ప్రతి విమర్శతో తిప్పికొట్టి విజయం సాధించామని విర్రవీగకుండా సద్విమర్శని సహృదయంతో స్వీకరించి స్వీయ లోపాలను అధిగమించినపుడే మన వ్యక్తిత్వం మరొక మెట్టు పైకి ఎదుగుతుంది.
ఎప్పుడైనా మనం గుర్తుంచుకోవాల్సింది......
సద్విమర్శకు సమాధానం......
మనల్ని మనం సరిదిద్దుకోవడమే!! . అలాగే కువిమర్శలకి సమాధానం
వాటిని పట్టించుకోకుండా వదిలేయడమే!!చెప్పాల్సింది చాలావుంది..చదవాల్సింది మిగిలే ఉంది....సకినాల సుధాకర్ పటేల్ సీనియర్ జర్నలిస్ట్

# పులసాని ఆరవింద్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ

**– ప్రాజెక్టు మేనేజర్ ఎండి సలామ్ ఆజాద్ అధ్యక్షతన**




(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 9 :- బ్రిత్ మోంటేన్ రీట్రీట్ సంస్థ శ్రీ పులసాని ఆరవింద్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా ఆరుట్ల గ్రామంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రాజెక్ట్ మేనేజర్ ఎమ్‌డీ సలామ్ అజాద్ అధ్యక్షతన జరిగింది. సంస్థ సిబ్బంది, అనుచరులు కలిసి ఆరవింద్‌రెడ్డి జన్మదినాన్ని ఆనందంగా జరుపుకున్నారు.
ప్రస్తుతం ఆరవింద్‌రెడ్డి హిమాలయ ప్రాంతంలో తపస్సులో నిమగ్నమై ఉన్నారని నిర్వాహకులు తెలిపారు. ఆయన ఆధ్యాత్మిక సాధనలో ఉండటం తమకు గర్వకారణమని సిబ్బంది పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఆయన సేవలు సంస్థ అభివృద్ధికి ఎంతో తోడ్పడుతున్నాయని వారు అభిప్రాయపడ్డారు.

# పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న జావేద్ లతీఫ్, కొండ దయానంద్ లకు షోకాజ్ నోటీసు

**ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కేంద్ర కమిటీ ప్రధానకార్యదర్శి జి. దేవరాజన్**

హైదరాబాద్, మార్చి 08: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న జావేద్ లతీఫ్, కొండ దయానంద్ చర్యలపై వివరణ కోరుతూ వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి జి. దేవరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. గత కొంత కాలంగా వీరు అనధికారికంగా సమావేశాలు నిర్వహిస్తూ పార్టీలో వర్గవాదం, విభేదాలు సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పార్టీ తదుపరి రాష్ట్ర మహాసభ జరిగే వరకు, కొత్త రాష్ట్ర కమిటీ ఎన్నికయ్యే వరకు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ గా అంబటి జోజిరెడ్డి కొనసాగుతారని ఀ ఆయన పేర్కొన్నారు. తెలంగాణ లోని పార్టీ సభ్యులు, నాయకులు, మద్దతుదారులు తప్పుడు ప్రచారాలను నమ్మకుండా, పార్టీని బలోపేతంచేయడానికి అంబటి జోజి రెడ్డికి పూర్తి సహకారం అందించాలని పార్టీ కేంద్ర కమిటీ కోరింది.

# టీడబ్ల్యూజేఎఫ్ సంఘం ఏ రాజకీయ పార్టీకి అనుబంధం కాదు

**-జర్నలిస్టుల పక్షాన పోరాడుతుంది**
**-త్వరలో భారీగా రాష్ట్ర మహాసభలు**
**-రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య**



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి హైదరాబాద్ :: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్( టీడబ్ల్యూజేఎఫ్) పట్ల కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టులను అయోమయానికి గురి చేయడానికే కొందరు ఈ సంఘం తమదే అంటూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, అలాంటి తప్పుడు ప్రచారాలను జర్నలిస్టులు నమ్మవద్దని కోరారు. సోమ వారం హైదరాబాద్ లో నల్గొండ జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ గోలి విజయకుమార్, పలువురు జర్నలిస్టులు టిడబ్ల్యూజేఎఫ్ లో చేరారు. వీరికి మామిడి సోమయ్య సంఘం సభ్యత్వం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ,ఫెడరేషన్ ఏ ఒక్క రాజకీయ పార్టీకి గానీ, ఏ ఒక్క మీడియా సంస్థకు గానీ అనుబంధం కాదని స్పష్టం చేశారు. సంఘం వ్యవస్థాపక సభ్యులు అన్ని జిల్లాల్లో పర్యటించి సంఘం బలోపేతానికి కృషి చేస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో కొందరు మాజీ నాయకులు సంఘాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. అన్ని జిల్లాల మహాసభలు త్వరితగతిన పూర్తి చేసి త్వరలో రాష్ట్ర మహాసభ భారీ ఎత్తున నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా జర్నలిస్టుల ప్రధాన సమస్యలు ఇప్పటి వరకు పరిష్కారం కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లుగా జర్నలిస్టులకు కొత్త అక్రిడేషన్ కార్డులు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫల మైందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టుల ఉద్యమానికి టీడబ్ల్యూజేఎఫ్ సిద్ధమవుతుందని మామిడి సోమయ్య హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కో కన్వీనర్ తన్నీరు శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ రవికుమార్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు పాల్వాయి జానయ్య తదితరులు పాల్గొన్నారు.

# బృమోస్ 2026” టెక్నో కల్చరల్ ఫెస్ట్




(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 9:-రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం లోని గురు నానక్ ఇన్‌స్టిట్యూషన్స్ (+చీ×ంజ ఀ గణిత)లో టెక్నో--కల్చరల్ ఫెస్ట్ “బ్రూమస్ ఫియెస్టా 2026 ” ను విద్యార్థులు మరియు అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని ఘనంగా నిర్వహించారు. ఈ ఫెస్ట్ విద్యార్థులు నేర్చుకునేందుకు, పరస్పరం చర్చించుకునేందుకు నాయకత్వం, సాంకేతిక నైపుణ్యాలు, టీమ్ బిల్డింగ్ సామర్థ్యాలను అభివృద్ధి చేసుకునేం దుకు ఒక అద్భుత వేదికగా నిలిచింది. సృజనాత్మకత ఆవిష్కరణలతో నిండిన వాతావరణంలో విద్యార్థులు తమ వ్యక్తిగత ప్రతిభను వివిధ సాంకేతిక మరియు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ప్రదర్శించే అవకాశం పొందారు. ఫెస్ట్ ప్రారంభోత్సవం గురు నానక్ ఇన్‌స్టిట్యూషన్స్ వైస్ చైర్మన్ గురు నానక్ యూనివర్సిటీ ఛాన్సలర్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ ప్రసంగంతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో గురు నానక్ ఇన్‌స్టిట్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ గురు నానక్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డా. హెచ్. ఎస్. సైనీ కూడా పాల్గొని విద్యార్థులను సృజనాత్మకత, ఆవిష్కరణలు సమగ్ర అభివృద్ధిని ప్రోత్సహించే కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డా. ఎస్. శ్రీనాథ రెడ్డి, ప్రిన్సిపల్ డా. బి. వెంకటరమణ రెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ డా. రిషి సయాల్, కోఆర్డినేటర్లు డా. సందీప్ పాటిల్, డా. సురేందర్ రావు, డా. విజయలక్ష్మి , కల్నల్ రిటైర్డ్ ఎం చంద్రశేఖర్ రావు పాల్గొని విద్యార్థులకు తమ జ్ఞానం, నైపుణ్యాలు సృజనాత్మకతను అభివృద్ధి చేసుకునేందుకు ఇలాంటి వేదికలను వినియోగించుకోవాలని ప్రోత్సహించారు. టెక్నో ఫియెస్టా భాగంగా పలు సాంకేతిక పోటీలు నిర్వహించబడ్డాయి. వీటిలో ప్రాజెక్ట్ ఎక్స్‌పో / ప్రోటోటైప్ ప్రెజెంటేషన్, కోడింగ్ ఀ డీబగ్గింగ్ చాలెంజ్‌లు, పేపర్ పోస్టర్ ప్రెజెంటేషన్స్, స్టార్టప్ పిచ్, క్విజ్, బ్రిడ్జ్ బిల్డింగ్ పోటీలు నిర్వహించబడ్డాయి.
ఈ ఫెస్ట్‌లో ప్రత్యేక ఆకర్షణగా ఆటో ఎక్స్‌పో నిలిచింది. ఇందులో పోర్షే, మినీ కూపర్, హోండా సివిక్ వంటి బ్రాండెడ్ మోడిఫైడ్ కార్లు ప్రదర్శించబడ్డాయి. విద్యార్థులు ఆటోమొబైల్ మోడిఫికేషన్స్ వాటి సాంకేతిక అంశాల గురించి అవగాహన పొందారు.
బ్రూమస్ వేడుకల భాగంగా రాబోయే చిత్రం “ఉస్తాద్ భగత్ సింగ్” సినిమా లో నటిస్తున్న ప్రముఖ నటి మరియు సెలబ్రిటీ కుమారి శ్రీలీల ఈ ఫెస్ట్‌లో పాల్గొని వేడుకలకు హాజరై, కార్యక్రమానికి మరింత గ్లామర్ ఉత్సాహాన్ని జోడించారు. పోటీలలో విజేతలు మరియు రన్నర్-అప్‌గా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేయబడ్డాయి.
విద్యార్థులు గురు నానక్ ఇన్‌స్టిట్యూషన్స్ సిబ్బంది సమిష్టిగా కృషి చేయడంతో బ్రూమస్ ఫియెస్టా 2026 విజయవంతంగా ఘనంగా ముగిసింది.

# ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం ఇక సహించం, మంజూరైన 10 కోట్ల అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలి

**– మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి**





హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి ఎల్బీనగర్ :మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్, ఎల్బీనగర్ జోన్, జోనల్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి మరియు ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన బిజెపి మాజీ కార్పొరేటర్లు పాల్గొని అధికారులకు వినతి పత్రం అందజేసి పలు ప్రజా సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు.

**ఈ సందర్భంగా మాట్లాడుతూ...**

– ముందుగా అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మన్సూరాబాద్ డివిజన్ అభివృద్ధి కోసం మంజూరైన సుమారు 10 కోట్ల రూపాయల నిధులతో చేపట్టాల్సిన పనులు ఇప్పటికీ ప్రారంభించకపోవడం ప్రజల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు.
ప్రజల అవసరాలకు సంబంధించిన అభివృద్ధి పనులు ఆలస్యం కావడం వల్ల స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అదే విధంగా డివిజన్లో దోమల బెడద తీవ్రంగా పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించకుండా యంత్రాలు ఀ సిబ్బంది లేరు అనే నిర్లక్ష్య సమాధానం చెబుతూ కాలయాపన చేస్తున్నారని ప్రజల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే ఈ సమస్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మన్సూరాబాద్ పెద్ద చెరువులో ఉన్న గుర్రపు డెక్కను తక్షణమే తొలగించాలని అధి కారులను కోరారు. చెరువు చుట్టూ వాకింగ్‌కు వచ్చే మహిళలు, వృద్ధులు, పిల్లలు, యువకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రజా సమస్యల పట్ల అధికారులు వెంటనే స్పందించి మంజూరైన అభివృద్ధి పనులను ఆలస్యం చేయకుండా ప్రారంభించి, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన బిజెపి మాజీ కార్పొరేటర్లు, నియోజకవర్గ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

# బర్కత్ పుర లో ఇఫ్తార్ విందు



హైదరాబాద్,మార్చి 08: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లీంలు ఒక్కపొద్దులు ఉంటూ పవిత్రంగా అల్లాను ఆరాదిస్తారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. అన్వర్ ఉలూం ఇనిస్టిట్యూట్స్ సెక్రటరీ నవాబ్ మహబూబ్ అలంఖాన్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు నవాబ్ ముజాహిద్ అలంఖాన్ ఆధ్వర్యంలో ఆదవారం రాత్రి బర్కత్ పుర లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీ, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు మోత రోహిత్ తదితరులు ఈ సందర్భంగా మత పెద్దలతో కలిసి ప్రార్థనలు చేసి ఇఫ్తారన్ను స్వీకరించారు. అనంతరం మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ ముజాయిద్ అలం ఖాన్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. రంజాన్ మాసం అనేది పేద, ధనిక భావం లేకుండా అందరిని స మా నంగా చూస్తుందని, ఇఫ్తార్ విందు ఇం దుకు నిదర్శ నమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను సమానంగా చూస్తుందని మంత్రి వివేక్ స్పష్టం చేశారు.

